సాక్షి
విశాఖపట్నం
గురువారం । 11 । మే । 2023



పాలిసెట్‌కు 93.5 శాతం హాజరు

జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. 93.5 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. IIలో



పేరే లేదు.. జీతాలిచ్చేస్తున్నారు!

వైద్య ఆరోగ్య శాఖలో తాజాగా అక్రమ ఉద్యోగుల నియామక వ్యవహారం వెలుగుచూసింది. IIలో



ప్రతీ పది నిమిషాలకు ఓ ట్విస్ట్

తాను నటించిన కస్టడీ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని హీరో నాగచైతన్య అన్నారు. IIలో

న్యూస్‌రీల్

శ్రీలక్ష్మీ మహా యజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష

దాబాగార్డెన్స్: విజయవాడలో ఈ నెల 12 నుంచి 17 వరకు నిర్వహించనున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంకు సంబంధించిన పోస్టర్‌ను దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష ఆవిష్కరించారు. బుధవారం కనక మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 12వ తేదీ ఉదయం 8.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీలక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. 13న ద్వారకా తిరుమలలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 14న అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం, 15న శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి లీలా కల్యాణ మహోత్సవం, 16న సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతాయన్నారు. 17న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిచే మహా పూర్ణాహుతి ఉంటుందన్నారు.

మేయర్‌కు ఆహ్వానం

దాబాగార్డెన్స్: విజయవాడలో ఈ నెల 12 నుంచి 17 వరకు నిర్వహించనున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష ఆహ్వానించారు. బుధవారం మేయర్ చాంబర్‌కు వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు.

రాష్ట్రం బాగుండాలి.. జగన్ మళ్లీ సీఎం కావాలి



తిరుమల ఆలయం వెలుపల ఎంపీ ఎంవీవీ

తిరుమల: రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని చెప్పారు. సీఎం జగన్ ప్రధానిని కలిసిన ప్రతిసారీ పోలవరం, ప్రత్యేక హోదా అంశాలపై వినతులు ఇస్తూనే ఉన్నారన్నారు. భవిష్యత్తులో మంచి జరుగుతుందని ఆశిస్తున్నానన్నారు.

వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జిల నియామకం



పీలా వెంకటలక్ష్మి　　వెంకట శివసాయి

సీతంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగ జోనల్ (విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి) ఇన్‌చార్జిలను నియమించారు. యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి సందీప్, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా పీలా వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ డ్రైవ్ రేపు

మురళీనగర్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ ఈ నెల 12న టెక్‌బీ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో హెచ్‌సీఎల్ టెక్‌బీ ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. 2022 లేదా 2023 సంవత్సరంలో 60% మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యువతీ యువకులు ఈ జాబ్ డ్రైవ్‌కి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12న ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 98484 38254 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పరవళ్లు

- నేడు కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్న సీఎం జగన్
- క్రికెట్ స్టేడియం ఆవరణలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- అపోలో క్యాన్సర్ యూనిట్ ప్రారంభం
- సీ హారియర్, స్పోర్ట్స్ ఎరీనా ప్రజలకు అంకితం
- భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్, ఎండాడలో కాపుభవన్‌కు శంకుస్థాపన

దొండపర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన అభివృద్ధికి సాక్ష్యంగా నిలవనుంది. పర్యాటక మణిమకుటం సీ హారియర్ మ్యూజియం, క్రీడా వైభవానికి సాక్ష్యంగా నిలవనున్న ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ఆయన ప్రజలకు అంకితం చేయనున్నారు. మత్స్యకారుల కలల కేంద్రం ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు అంకురార్పణ జరగనుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియం ప్రాంగణంలో మహానేత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ, అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ యూనిట్ ప్రారంభం, కాపు సంక్షేమ భవన్‌కు శంకుస్థాపన తదితర కార్యక్రమాలు సీఎం జగన్ చేతులమీదుగా జరగనున్నాయి.



ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ఆవిష్కరణకు సిద్ధమైన వైఎస్సార్ విగ్రహం

స్టేడియంలో వైఎస్సార్ విగ్రహం

విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ నిలువెత్తు విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్నారు. ఈ విగ్రహం నిర్మాణానికి ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌తో పాటు జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. విగ్రహం దూరం నుంచి ఆకట్టుకునే విధంగా రూపొందించారు. ముందుగా అనుకున్న బేస్‌మెంట్‌ను కాస్త పెంచారు. విగ్రహం బరువుకు అనుగుణంగా బేస్‌ను 90 డిగ్రీల నుంచి 45 డిగ్రీల యాంగిల్‌కు మార్చి ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

సీఎం పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 3.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా 3.50కి పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.50 గంటలకు ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ అపోలో క్యాన్సర్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఫొటో సెషన్‌లో పాల్గొని.. రేడియేషన్ పరికరాల కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి 5.50 గంటలకు బీచ్‌రోడ్డుకు చేరుకుని రూ.7.5 కోట్లతో నిర్మించిన సీ–హారియర్ మ్యూజియం, ఎంవీపీకాలనీలో రూ.25.5 కోట్లతో నిర్మించిన జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా, రామ్‌నగర్‌లో రూ.12 కోట్లతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం భీమిలిలో రూ.24.86 కోట్లతో నిర్మించనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్, ఎండాడలో కాపు భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6.15 గంటలకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కుమారుడి వివాహానికి హాజరవుతారు. సాయంత్రం 7 గంటలకు తిరుగు పయనమై రాత్రి 8.20కి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

రూ.24.86 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్

భీమిలి తీరగ్రామాల మత్స్యకారుల కల నెరవేరనుంది. ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.24.86 కోట్ల వ్యయంతో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. దీని ద్వారా భీమిలిలో తోటవీధి, బోయవీధి, ఎగువపేట, నాగమయ్యపాలెం, మరి కొన్ని ప్రాంతాల మత్స్యకారులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం భీమిలిలో 141 మోటరైజ్డ్ బోట్లు, 109 నాన్‌మోటరైజ్డ్ బోట్లలో మత్స్యకారులు వేట చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 1,524 మంది మత్స్యవేటపైనే జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా 403.16 మెట్రిక్ టన్నుల మత్స్య సంపద వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇక్కడ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా 250 బోట్లకు సేఫ్ పార్కింగ్, వేలం హాలు, నెట్ మెండింగ్ సెంటర్, కమ్యూనిటీ హాల్, 2 ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫాంలు, ట్రక్ పార్కింగ్, గ్రామం నుంచి ల్యాండింగ్ సెంటర్ వరకు సిమెంట్ రోడ్లు, గొడౌన్లు, ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఇలా అనేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

రూ.25.5 కోట్లతో స్పోర్ట్స్ ఎరీనా

అన్ని రంగాల్లోనూ అంతర్జాతీయ హంగులు సంతరించుకుంటున్న విశాఖ.. క్రీడారంగంలోనూ తిరుగులేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఎంవీపీకాలనీ సెక్టార్–8లో ఏఎస్ కాలేజీ గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న వీఎంఆర్‌డీఏకు చెందిన 1.27 ఎకరాల స్థలంలో రూ.25.5 కోట్లతో జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను నిర్మించింది. బేస్‌మెంట్‌తో పాటు గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌తో నిర్మించిన ఈ స్టేడియంలో అనేక సౌకర్యాలు కల్పించారు. 2107 చ.మీ విస్తీర్ణంలో బేస్‌మెంట్ ఏరియా, 1449 చ.మీ విస్తీర్ణంలో నిర్మించిన గ్రౌండ్‌ఫ్లోర్‌లో అత్యాధునిక బ్యాడ్మింటన్ కోర్టుతో పాటు వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేశారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు ఇక్కడ ఉంచనున్నారు.

స్టేడియంలో సౌకర్యాలు : ఇండోర్ బాస్కెట్ బాల్ కోర్టు–1, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు–6, ఇండోర్ వాలీబాల్ కోర్టు–1, స్విమ్మింగ్ పూల్, కిడ్స్ పూల్, అవుట్‌డోర్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, సింథటిక్ అండ్ వుడెన్ ఫ్లోరింగ్, వాల్ క్లాడింగ్, స్పోర్ట్స్ ఫిజియోథెరపీ, యోగా సెంటర్, జిమ్, బోర్డ్ గేమ్స్, చేజింగ్ రూమ్స్, లాకర్స్, జాగింగ్ ట్రాక్, 294 సీటింగ్ సామర్థ్యం



రూ.7.5 కోట్లతో సీ హారియర్ మ్యూజియం

బీచ్‌రోడ్డులో మరో పర్యాటక కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ఇప్పటికే సబ్‌మెరైన్, టీయూ–142 యుద్ధ విమానం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఏర్పాటు చేసిన సీ హారియర్ మ్యూజియం మరో పర్యాటక మణిహారంగా మారనుంది. రూ.7.5కోట్లతో ఈ మ్యూజియాన్ని వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసింది. 1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ–హారియర్ యుద్ధ విమానం.. నౌకాదళం ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్ఎస్ హంస యుద్ధ నౌకలో 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వీఎంఆర్‌డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీహారియర్‌ను వేలాడదీశారు. ఇందులో ఏర్పాటు చేసిన సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ మ్యూజియాన్ని సీఎం జగన్ గురువారం సాయంత్రం 5.50 గంటలకు ప్రారంభించనున్నారు. ఇక్కడి నుంచే జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కూడా ప్రారంభిస్తారు.



విశాఖకు అంతర్జాతీయ స్థాయే లక్ష్యం

- రూ.6,500 కోట్లతో విశాఖ–భోగాపురం రహదారి
- గ్రీన్‌ఫీల్డ్ హైవే డీపీఆర్ రూపకల్పనకు అనుమతులు
- మంత్రి ఆదిమూలపు సురేష్
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సాక్షి, విశాఖపట్నం/ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్రలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణబద్ధులుగా ఉన్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ పరిశీలించారు. సీహారియర్ మ్యూజియంను సందర్శించి.. వీఎంఆర్‌డీఏ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మీడియాతో మాట్లాడారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇటీవలే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని.. ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీలో భాగంగా విశాఖ నుంచి ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. రూ.6,500 కోట్లతో నిర్మించనున్న ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ రూపకల్పనకు ప్రాథమికంగా అనుమతులు లభించాయని చెప్పారు. త్వరలోనే తదుపరి కార్యచరణ ప్రణాళిక అమలు చేస్తామన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి సీఎం విశాఖలోనే ఉంటారని పునరుద్ఘాటించారు. రాబోయే కొద్ది నెలల్లో విశాఖలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు. కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. అనంతరం మంత్రి సురేష్ ఎంవీపీకాలనీలో నిర్మించిన స్పోర్ట్స్ ఏరీనాను సందర్శించారు. ఇక్కడ చేసిన ఏర్పాట్లతో పాటు ప్రాజెక్ట్ వివరాలను జీవీఎంసీ కమిషనర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంవీపీకాలనీలో రూ.26 కోట్లతో నిర్మించిన అధునాతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ సీఎం ప్రారంభించిన అనంతరం అందుబాటులోకి వస్తుందన్నారు.



సీ హారియర్ మ్యూజియం వద్ద సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్

ఎమ్మెల్యే అభ్యర్థన అర్థరహితం

సీఎం ప్రారంభించనున్న ప్రాజెక్టుల శిలాఫలకాలపై చంద్రబాబు, కొందరు టీడీపీ నాయకుల పేర్లు వేయాలని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి చేసిన అభ్యర్థన అర్థరహితమని మంత్రి సురేష్ అన్నారు. ఈ ప్రాజెక్టులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి, త్వరితగతిన పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. అందువల్ల ఇవి పూర్తిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రాజెక్ట్‌లే అన్నారు. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో టీడీపీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి వదిలేసిందన్నారు. శంకుస్థాపనకు మించి ఆ పార్టీ చేసిందేమి లేదన్నారు.

సీఎం జగన్ పర్యటనకు పటిష్ట భద్రత

1,700 మందితో బందోబస్తు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. సీఎం నగరంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో 1,700 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం పర్యటించి అక్కడ చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి బందోబస్తు విషయంలో దిశానిర్దేశం చేశారు.

- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ సిబ్బందిని నియమించారు.
- సీఎం పర్యటనలో పాల్గొనే ముఖ్యుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ స్థలాలను కేటాయించారు.
- ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని భద్రతా చర్యలు చేపట్టారు.



సమావేశంలో అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

- సీఎం పర్యటనలో భాగంగా ఆయా రూట్లలో సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

ఏర్పాట్ల పరిశీలన

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగాన్ని గురువారం ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను డీసీపీ క్రైం నాగన్న, ద్వారకా ఏసీపీ మూర్తి, ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. ప్రొటోకాల్ ప్రకారం చేపడుతున్న కార్యక్రమాల గురించి రూరల్ తహసీల్దార్ పి.రమణయ్యను అడిగి తెలుసుకున్నారు.

ఫోన్ చేస్తే.. వెంటనే పరిష్కారం

- సమస్య ఉంటే 'జగనన్నకు చెబుదాం'
- 1902 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- మీడియా సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్‌వర్మ

సాక్షి, విశాఖపట్నం : అర్జీల ద్వారా పరిష్కారానికి సాధ్యం కాని సమస్యలను 1902 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసి.. వేగవంతమైన, నాణ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై కలెక్టరేట్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్నది 'జగనన్నకు చెబుదాం' ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. అర్జీదారులు 1902 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రత్యేకంగా నియమించిన సీనియర్ లెవెల్ ఐఏఎస్ అధికారులు నెలకు రెండుసార్లు జిల్లాల్లో పర్యటిస్తూ.. ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలించనున్నారని తెలిపారు. ఫోన్‌కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదుల్ని సీఎంవో స్థాయి నుంచి నేరుగా సచివాలయాల పరిధిలోని ఆయా శాఖల విభాగాల వరకు సీనియర్ అధికారులు పర్యవేక్షణలో పరిష్కృతమయ్యేలా చర్యలు చేపడతారన్నారు.

డిస్ట్రిక్ట్ ఆడిట్ టీమ్, పీఎంయూ ఏర్పాటు

ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఆడిట్ టీమ్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల్ని పరిశీలించి 15 రోజులకోసారి సంబంధిత నివేదికల్ని తనకు, పోలీస్ కమిషనర్‌కు అందిస్తారన్నారు. దీని ద్వారా ఫిర్యాదుల పరిష్కారం ఎంత మేర జరుగుతుందనేది స్పష్టం అవుతుందని తెలిపారు. డివిజన్ స్థాయిలో అందే ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు.. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఒక పర్సుయేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్(పీఎంయూ) ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండల స్థాయిలో అందే ఫిర్యాదులను డివిజన్ స్థాయిలో, గ్రామ స్థాయిలో అందే ఫిర్యాదులను మండల స్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. వీటిద్వారా నాణ్యమైన పరిష్కారం చూపడంతో పాటు ఎప్పటికప్పుడు పరిష్కార స్టేటస్ అర్జీదారుడి ఫోన్‌కు మెసేజ్ రూపంలో అందించనున్నట్లు వివరించారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ మాట్లాడుతూ కమిషనర్ తన కార్యాలయంలో కాల్ సెంటర్ ఓపెన్ చేస్తున్నామని వెల్లడించారు. ఈ కాల్ సెంటర్ 24 గంటలు పనిచేస్తుందనీ.. దీని కోసం ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కాల్ సెంటర్‌ని ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు పర్యవేక్షిస్తారని స్పష్టం చేశారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ వర్మ

'డయల్ యువర్ మేయర్' ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన

దాబాగార్డెన్స్: డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై మేయర్ గొలగాని హరి వెంకటకుమారి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌లో జోన్–3 నుంచి వచ్చిన ఫిర్యాదులను విచారించేందుకు బుధవారం ఆమె డీఆర్‌డీఏ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇక నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే తనిఖీ చేస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం నిర్వహణ, రోడ్ల అసంపూర్తి నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయని.. వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిగిలిన రోడ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, ఇంజినీరింగ్, ప్రజా ఆరోగ్యపు అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

సీపెట్‌లో ప్రవేశాల దరఖాస్తుకు 28 గడువు

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశానికి ఈ నెల 28వ తేదీతో గడువు ముగియనుందని సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ తెలిపారు. లాసన్స్‌బే కాలనీలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ వేదికగా సీపెట్ సేవలు అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా మూడేళ్ల వ్యవధిలో డిప్లమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ) కోర్సులను సంస్థ అందిస్తున్నట్టు తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులన్నారు. బీఎస్సీ ఉత్తీర్ణత లేదా ఆఖరి సంవత్సరం జరుగుతున్న విద్యార్థులు రెండేళ్ల వ్యవధితో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు cipet.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వడగాడ్పులు... ఉక్కపోత



వడగాడ్పులతో ప్రజలు అల్లాడిపోయారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచే ఎండ చుర్రుమనిపించింది. 10 గంటల నుంచి ఎండ తీవ్రత మరింత పెరగడంతోపాటు వడగాడ్పులు మొదలయ్యాయి. అప్పటి నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం భయపడ్డారు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఇళ్లలో ఫ్యాన్ల కింద కూర్చున్నా వేడిగాలి వస్తుండడంతోపాటు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. చలివేంద్రాలు, శీతలపానీయాల దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. కాగా నగరంలో బుధవారం 37.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



- ఫొటోలు, సాక్షి ఫొటోగ్రాఫర్

నీడ.. మాయమైంది..!





సాక్షి, విశాఖపట్నం: మహా నగరంలో సడన్‌గా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. మధ్యాహ్నం సమయంలో కొద్ది నిమిషాల పాటు నీడ కనిపించలేదంటూ నగర వాసులు కంగారు పడ్డారు. నిరంతరం తమ వెంట నడిచే నీడ ఒక్కసారిగా మాయమైపోవడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. జీరో షాడో డే నగరంలో బుధవారం ఏర్పడింది. ఆ సమయంలో ఎండలో నిటారుగా (90 డిగ్రీల కోణం) ఉంచిన ఏ వస్తువు నీడ రెండు మూడు నిమిషాల పాటు కనిపించలేదు. ఈ అరుదైన సంఘటనను చూసి నగరవాసులు ప్రత్యేక అనుభూతి చెందారు. ఇదే విధంగా ఈ ఏడాది ఆగస్టు 3వ తేదీన కూడా 'జీరో షాడో డే' ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

బంగారం కోసం మహిళ దారుణ హత్య

- స్నేహంగా మెలిగి ఆటో డ్రైవర్ ఘాతుకం
- మిస్సింగ్ కేసులో కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు



రీసు గోపి (ఫైల్)



నిందితుడు మైలిపల్లి రాజు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కె.లక్ష్మణమూర్తి

కొమ్మాది(భీమిలి): బంగారం కోసం ఓ మహిళను ఆటో డ్రైవర్ దారుణ హత్య చేసిన సంఘటన భీమిలిలో సంచలనం రేపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తగరపువలస బాలాజీనగర్‌కు చెందిన రీసు గోపి(30) అనే యువతికి పదేళ్ల కిందట విజయనగరానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా ఆమె భర్తతో విడిపోయింది. అప్పటి నుంచి గోపి తన అక్క రీసు రాము వద్ద ఉంటోంది. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి పాతూరుకు చెందిన ఆటో డ్రైవర్ మైలిపల్లి రాజుతో గోపికి పరిచయం ఏర్పడింది. ఇది స్నేహంగా మారి అప్పుడప్పుడు కలుసుకుంటుండేవారు. ఈ క్రమంలో ఈ నెల 1న తన మేనమామ కమార్తె పెళ్లి చూపులుకు అలంకరణ కోసం బంగారు వస్తువులు(10 తులాలు) తీసుకుని చిప్పాడకు వెళ్లాలని రాజుకు ఫోన్ చేసి తగరపువలస రావాలని గోపి చెప్పింది. అదే రోజు సాయంత్రం పెళ్లి చూపులు ముగించుకుని తిరిగి తన ఇంటి వద్ద విడిచిపెట్టాలని కోరింది. అయితే అలా బయటకు వెళ్దామని రాజు కోరగా.. ఆమె సరే అంది. దీంతో ఇద్దరూ కాపులుప్పాడ గంభీరం గెడ్డ వద్దకు చేరుకున్నారు. తనకు అప్పులు ఉన్నాయని, అవి తీర్చేందుకు బంగారం కావాలని గోపిని రాజు అడిగాడు. ఇందుకు ఆమె అంగీకరించకపోవడంతో ఆటోలో ఉన్న తాడును గోపి మెడకు చుట్టి హత్య చేసి అదే గెడ్డలో పడేసి, 10 తులాల బంగారాన్ని తీసుకుని పారిపోయాడు.

మిస్సింగ్ కేసుతో దర్యాప్తు

ఈ నెల 1న చిప్పాడ వెళ్లిన తన చెల్లి తిరికి రాకపోవడంతో ఆమె అక్క రీసు రాము 2వ తేదీన భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం గాలించిన పోలీసులకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో కాల్‌డేటా ఆధారంగా ఈ కేసును ఛేదించారు. గోపి చివరిగా ఫోన్‌లో మాట్లాడింది రాజుతోనే అని తెలుసుకున్న పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో రాజు మొబైల్ సిగ్నల్ ఆధారంగా బీచ్ రోడ్డు మంగమారిపేటలో ఉన్నట్టు గుర్తించారు. పోలీసులు, గోపి బంధువులు మంగళవారం రాత్రి రాజును పట్టుకునేందుకు మంగమారిపేట చేరుకున్నారు. ఇది తెలుసుకున్న రాజు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన రీతిలో విచారించగా.. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం కావాలని గోపిని అడిగానని, ఆమె నిరాకరించడంతో కోపంతో హత్య చేసి గెడ్డలో పడేసినట్టు నేరాన్ని ఒప్పుకున్నాడు. గెడ్డలో పడి ఉన్న గోపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని గోపి కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.

జాబితాలో పేరే లేదు.. జీతాలిచ్చేస్తున్నారు!

- అక్రమాలకు కేంద్ర బిందువుగా వైద్య ఆరోగ్యశాఖ
- తాజాగా వెలుగులోకి ఉద్యోగుల అక్రమ నియామకం
- గత డీఎంహెచ్‌వోపై స్పందనలో ఫిర్యాదు

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ.. అక్రమాలకు కేంద్ర బిందువుగా మారింది. నిన్నటి మొన్నటి వరకు నకిలీ సర్టిఫికెట్లు, ఆర్డర్లతో వార్తల్లో నిలిచిన వైద్య ఆరోగ్య శాఖలో తాజాగా అక్రమ ఉద్యోగుల నియామక వ్యవహారం వెలుగుచూసింది. అభ్యర్థుల ఎంపిక కోసం వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన ఏ జాబితాలో పేరు లేకపోయినా.. ఏడుగురు దర్జాగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి నెలసరి జీతాలు క్రమం తప్పకుండా అందుతున్నాయి. గత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బదిలీ సమయంలో ఈ నియామకాలు జరిగినట్టు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. అక్రమంగా ఏడుగురు పోస్టులు పొందారని కొంత మంది స్పందనలో ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైద్య ఆరోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బోధనాస్పత్రుల్లో ఎప్పటికప్పుడు పోస్టులు భర్తీ చేస్తోంది. ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కోసం ఆస్పత్రుల్లో 14 మందిని నియమించింది. ఇలా అన్ని విభాగాల్లో పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతోంది. అయితే దీనిని కొంత మంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పోస్టుల భర్తీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కో రేటు నిర్ణయించి ఉద్యోగాలిచ్చేస్తున్నారు.

బదిలీ ఉత్తర్వులు జారీ అయిన వెంటనే..

గత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హయాంలో వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టులు భర్తీ చేశారు. కార్యాలయం సిబ్బంది, అధికారుల మీద నమ్మకం లేక ఆ డీఎంహెచ్‌వో ఓ మెడికల్ ఆఫీసర్‌ను నియమించుకుని పోస్టులు భర్తీ చేయించినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయినా ఎవరి మాట వినకుండా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగించారు. ఇంతలో డీఎంహెచ్‌వో బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. వెంటనే తెర వెనుక అక్రమ పోస్టులను భర్తీ చేశారు. ఏ జాబితాలో పేరు లేకపోయినా ఏడుగురికి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. నగరం, అనకాపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ఫార్మాసిస్ట్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక జూనియర్ అకౌంట్ ఆఫీసర్, ఓ డాటా ఎంట్రి ఆపరేటర్(డీఈవో)ను భర్తీ చేసినట్లు సమాచారం. ఈ ఏడు పోస్టులు ఎంపిక జాబితాలో లేవని, కానీ జీతాలు ఇచ్చే జాబితాల్లో కనిపిస్తున్నాయని కొంత మంది స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి వారు జీతాలు తీసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు.

విచారణ చేపడతాం



ఈ వ్యవహారం నా దృష్టికి రాలేదు. ఈ ఏడు పోస్టుల గురించి విచారణ చేపడతాం. ఎక్కడా అక్రమాలు జరిగేందుకు అవకాశం లేదు. ఒక వేళ జరిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం. భర్తీ ప్రక్రియను మరింత పకడ్బందీగా చేపడతాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో, విశాఖపట్నం

బోధన పద్ధతుల్లో మార్పు రావాలి

డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: బోధన పద్ధతుల్లో మార్పు రావాలని డీఈవో ఎల్. చంద్రకళ అన్నారు. నగరంలోని వైఎంసీఏ హాల్లో మూడు రోజులుగా ఇంగ్లిష్ సబ్జెక్టుపై జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధనలోను మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల అభిరుచి మేరకు పాఠ్యాంశాల బోధన సాగాలన్నారు. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే శిక్షణను విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఏపీసీ శ్రీనివాసరావు, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, డైట్ కాలేజీ అధ్యాపకులు గొట్టేట రవి పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్ రాజుకు అభినందన



ఉత్తమ డ్రైవర్ రాజును అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

అల్లిపురం(విశాఖ దక్షిణ): 'హీరోస్ ఆన్ రోడ్'పేరిట అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్స్ సంస్థ జాతీయ స్థాయిలో ప్రకటించిన నగర, విశాఖపట్నం సిటీ విభాగాల్లో ఉత్తమ డ్రైవర్‌గా ఆర్టీసీ సింహాచలం డిపోకు చెందిన డ్రైవర్ ఎస్.ఎ.రాజు ఎంపిక కావడం తెలిసిందే. ఈయన తన 34 సంవత్సరాల సర్వీసులో ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్‌గా గుర్తింపు పొందారు. ఈ మేరకు గత నెల 18న ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ట్రోఫీ, ప్రశంసా పత్రం, రూ.10 వేలు నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా రాజును ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.బ్రహ్మానందరెడ్డి, జోన్–1, విజయనగరం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, తదితరులు కూడా ఆయనను అభినందించి, అందరూ ప్రమాదరహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

పాలిసెట్‌కు 93.5 శాతం హాజరు





సోఫియా కాలేజీ వద్ద తనిఖీలు చేస్తున్న మహిళా పోలీస్

మురళీనగర్: జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సారి పాలిసెట్‌కు రికార్డ్ స్థాయిలో విద్యార్థులు దరఖాస్తు చేసి.. అదే స్థాయిలో పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో 12,880 మంది దరఖాస్తు చేయగా.. 12,048 మంది హాజరవడంతో 93.5 శాతం నమోదైనట్లు పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ కేడీవీ నరసింహారావు చెప్పారు. విశాఖ నగరం నుంచి 11,922 మందికి 11,149 మంది హాజరవగా వీరిలో 6,760 మంది బాలురు, 4,389 మంది బాలికలు ఉన్నారు. నగరంలో 93.51శాతం హాజరు నమోదైంది. భీమిలిలో 958 మందికి 894 మంది హాజరవగా.. వీరిలో 546 మంది బాలురు, 348 మంది బాలికలలు ఉన్నారు. 93.31 శాతం హాజరు నమోదైంది.

ప్రతి ఒక్కరికీ అవకాశం

సాంకేతిక సమస్యల వల్ల హాల్ టికెట్లు రాని వారికి టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు పరీక్షప్రారంభానికి గంట ముందు వరకు కో–ఆర్డినేటింగ్ కేంద్రాల్లో హాల్ టికెట్లు జారీ చేశారు. అదే కేంద్రంలో పరీక్షకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు. విశాఖ కో–ఆర్డినేటింగ్ కేంద్రం(కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల)లో 124 మందికి హాల్ టికెట్లు జారీ చేసి.. వీరిందరికి అదే కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కో–ఆర్డినేటర్ చెప్పారు. భీమిలిలో ఇలా 8 మందికి హాల్ టికెట్లు జారీ చేశారు. టెక్నిక్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పరిశీలకుడు ఎంఏవీ రామకృష్ణ పరీక్ష కేంద్రాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎస్ రాజా జూనియర్ కాలేజీ, సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ, శ్రీనివాస ఫార్మసీ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. శ్రీకాకుళం కంప్యూటర్ హెడ్ గండి గోవిందం నాయుడు కంచరపాలెం కళాశాల పరిశీలకుడిగా వ్యవహరించారు.



కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్‌ను సరిచూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న టెక్నికల్ ఎడ్యుకేషన్ డీడీ రామకృష్ణ

ప్రతీ పది నిమిషాలకు ఓ ట్విస్ట్

- అరవింద్ స్వామి లేనిదే 'కస్టడీ'లేదు
- హీరో నాగచైతన్య



బీచ్‌రోడ్డు: తాను నటించిన కస్టడీ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని హీరో నాగచైతన్య అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీనియర్ నటుడు అరవింద స్వామి లేనిదే కస్టడీ సినిమా లేదన్నారు. ఆయన పోషించిన పాత్ర ఆధారంగానే సినిమాకు కస్టడీ అనే టైటిల్ పెట్టామన్నారు. ఆయన ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించారనే విషయం తెలిగానే.. మా బృందానికి నమ్మకం పెరిగిందన్నారు. ఈ సినిమాకి సంబంధించి ముందు ఓ పాయింట్ చెప్పిన దర్శకుడు వెంకట్ ప్రభు కొన్ని నెలల తర్వాత పూర్తి స్టోరీ చెప్పారన్నారు. కథ, స్క్రీన్‌ప్లే నచ్చడంతో సినిమా ప్రారంభమైందన్నారు. సినిమా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా బాగుంటుందని, శరత్ కుమార్, ప్రియమణి వంటి సీనియర్ నటులు ఇందులో నటించారన్నారు. సినిమాలో ప్రతీ పది నిమిషాలకు ఓ ట్విస్ట్ ఉంటుందన్నారు. సినిమా మొదలైన 40 నిమిషాల తర్వాత నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుందని చెప్పారు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతుందని, అందరూ థియేటర్‌లో ఈ సినిమా చూడాలని కోరారు. ఏ కథనైనా బలంగా నమ్మి తెరకెక్కిస్తే అది ఆటోమేటిక్‌గా పాన్ ఇండియా సినిమా అవుతుందన్నారు. హీరోగా అన్ని జోనర్ సినిమాలు చేయాలని ఉందని, మంచి కథ కుదిరితే అఖిల్‌తో తప్పకుండా నటిస్తానన్నారు. వైజాగ్ అంటే తనకు చాలా ఇష్టమని.. ఇక్కడ చిత్రీకరించిన ప్రతీ సినిమా హిట్ అవుతుందన్న నమ్మకం ఉందన్నారు. తాను నటించిన ప్రేమమ్, మజిలీ సినిమాల షూటింగ్ అధిక భాగం ఇక్కడే జరిగిందని గుర్తు చేశారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,130
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,950
వెండి(కిలో):	రూ.82,700

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.140
స్కిన్	: రూ.250
స్కిన్‌లెస్	: రూ.260

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	490.00
విజయనగరం	494.00
శ్రీకాకుళం	494.00

రైల్వే డీఎస్పీగా మోహనరావు బాధ్యతల స్వీకరణ



బి.మోహనరావు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్ఆర్‌పీ)గా బి.మోహనరావు బుధవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు విజయనగరం జిల్లా బొబ్బిలి సబ్ డివిజనల్ పోలీస్‌ఆఫీసర్(ఎస్‌డీపీవో)గా విధులు నిర్వర్తించారు. సుమారు 20 నెలల పాటు రాజమండ్రి డీఎస్ఆర్‌పీ బి.వి.ఎస్.నాగేశ్వరరావు విశాఖపట్నం ఇన్‌చార్జి డీఎస్ఆర్‌పీగా వ్యవహరించారు. ప్రయాణికుల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా మోహనరావు తెలిపారు. వీఐపీల భద్రత, దొంగతనాల నివారణ, నేరాలు, అవాంఛనీయ సంఘటనలు నివారిస్తూ, పెట్రోలింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా గంజాయి రవాణాపై కఠిన నిఘా ఉంచాలని, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, ఇంటిలిజెన్స్, ఎస్ఈబీలతో సమన్వయంతో పని చేయాలన్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ సీఐ పి.కోటేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.